కథానిక

# పరమపద సోపాన పటము

ఊటుకూరు రంగారావు

ప్రతి ఉదయం రైల్వేస్టేషన్‌కు వెళ్ళి, అక్కడ జనసమ్మర్దాన్నీ, రకరకాల వింతలనీ చూస్తూ క్షణకాలం భవిష్యత్తునూ గతాన్నీ కూడా మరచి ఆనందం అనుభవించడం. అక్కణ్ణించి దగ్గరే ఉన్న పోస్టాఫీసుకు వెళ్ళి ఏవన్నా ఉత్తరాలుంటే తీసుకుని చదువుకుంటూ, తృప్తితో ఇంత కాఫీ సేవించి తిన్నగా ఆఫీసుదోవ పట్టడం. ఇదీ నా సాధారణ దినకృత్యం. స్టేషన్‌లో పనివున్నా, లేకున్నా పోస్టులో ఉత్తరాలు వస్తాయనే ఆశ లేకున్నా సరే, తప్పనిసరిగా వెళ్ళి తిరిగి రావలసిందే. ఇది వదిలించుకోలేని అలవాటుకింద మారిపోయింది. అందులోనూ ఇలాంటి పట్టణాల్లో ఒంటరివాళ్ళకి, ముఖ్యంగా ఆఫీసు గుమాస్తాలకి, ఇంత సానుభూతి చూపించి, ఏ సమయంలోనైనా ఆశ్రయమిచ్చేవి. స్టేషనూ, పార్కూ, పోస్టాఫీసు మొదలైనవే. నా మట్టుకు నాకు ఇవన్నీ లేకపోతే ఎంతో మనోవ్యాధితో చచ్చిపోయే వాణ్ణేమోననిపిస్తుంది.

ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఇలా వస్తూ పోతూవుండటంలో ఒక మాధుర్యమేగాక, రకరకాల ముఖాల పరిచయం లభిస్తుంది. మనలాగనే ఏదో పనిమీద అదే టైముకు ఇంకోచోటికి నిత్యకృత్యంమీద వెళ్ళేవారు బోలెడుమందివుంటారు. వాళ్ళూ మనం ప్రతిరోజూ ఒకేచోట క్రమం తప్పకుండా కలుసుకుంటాం. విడిపోతాం మళ్ళీ మర్నాడు కలుస్తాం.

నేనింటినుంచి బయలుదేరి స్టేషన్‌కుచేరుకునే లోపల, ఎంతోమందిని చూస్తాను. కాని ముఖ్యముగా నలుగురు మాత్రం ప్రతిరోజూ ప్రత్యేక స్థలాల్లో తారసపడుతూండేవాళ్ళు. వాళ్ళెవరో నాకు తెలీదు. నేనెవరో వాళ్ళకి తెలీదు ఐనప్పటికీ మేము రోజూ కలుస్తూనేవుంటాం తప్పనిసరిగా.

సరిగ్గాఎనిమిదిమ్ముప్పావుకి ఇంటినుంచి బయలుదేరి, చౌరస్తాలోకి అడుగుపెడతానోలేదో ముందరగా నాకంటికి కనపడేది కూరగాయలకోసం సంచీ పట్టుకుని దుకాణం ముందు నిలబడ్డ శాస్త్రిగారు ఆయనకిది నిత్యకృత్యం. అక్కడతప్ప నాకు మరెక్కడా కనపడడు. ఆయన్ని దర్శించుకుని మండీ బజారుగుండా నడుస్తూంటే ఇంకో వ్యక్తి కనిపిస్తాడు. ముఖంమీద సన్నని నిలువుబొట్టూ, నల్లకోటూ, తలపాగా, బిళ్ళగోచీపోసికట్టిన పంచెతో, చంకలో ఇంతలావు ఫైళ్ళకట్టతో, నేను దాటివచ్చిన బజారుకే వెళుతూ ఎదురవుతాడు. ఆయనగారు ప్లీడరు గుమాస్తా అని నా నిర్ధారణ. ఇంకొంచెందూరంలో. రైల్వేక్రాసింగ్ దగ్గరగా చేరుకోగానే. అటునుంచి నలుగురు విద్యార్థినులు చుట్టూ కబుర్లు చెబుతూంటే, చేతిలో నాజూగ్గా పట్టుకున్న పుస్తకాల్తో, చిరునవ్వుతో స్కూలుకువెళ్ళే పంతులమ్మ. ఆవిడ ఏ స్కూలుకి వెడుతూందో ఆ దారంతా నాకు తెలీదుకాని, మొత్తానికి టీచరు అని మాత్రం తెలుసు. ఇంకాకొంచెం వెళ్ళానంటే స్టేషన్ మొగలో కలుస్తుంది ఒక హాస్పిటాల్ నర్సు. చకచకా గొడుగు చేతిలో పుచ్చుకుని నడిచి పోతూంటుంది. నిప్పులు చెరిగే ఎండల్లోనూ, ఎడ కావలసిన శీతాకాలంలోనూ ఆవిడ కదే గొడుగు. మారదు. అక్కడికి నా ప్రయాణం ఒక మజిలీకి చేరుతుంది.

క్రమం తప్పకుండా రోజూ, అదే సమయానికి అవే ప్రదేశాల్లో వీళ్ళని నేను చూస్తుంటాను. ఒక్క వీసం మార్పుకూడా వుండదు...రోజూ అలా వాళ్ళంత నిక్కచ్చిగా టైం ప్రకారంపోకపోతే ఏం మునిగిపోయిందని నాలో నేను అనుకుంటూంటాను. కాని, నేనూ అదే సమయానికి వాళ్ళకి అదేచోట కలియడంతో వాళ్ళుమాత్రం ఇలా ఎందుకనుకోరూ? అనుకుంటారు. తప్పక ఆలోచిస్తారు. ఈ నలుగురిలో ఏదన్నా కారణం వల్ల ఏ ఒక్కరు కనిపించకున్నా ఆవాళ నా ప్రయాణం తృప్తికరంగాలేక చికాగ్గా వుండేది.

ఏదో వస్తువు పోగొట్టుకున్నట్టనిపించి వెనక్కి తిరిగిచూస్తూ వెళతాను. వాళ్లూ నేనూ ఇంత దీర్ఘకాలంనుంచీ అలా కలుస్తూనేవున్నాం. కాని మాట్లాడుకునే అవసరం ఎవరికీ కలగదు. ఐనప్పటికీ వారికీ నాకూ మధ్యన ఏదో ఆత్మీయతా, దాన్ని మించిన సహోదరత్వమూ గూడుకట్టుకుని వున్నాయి.

ఇవాళకూడా మామూలుకు భిన్నంలేకుండా ఆ దృశ్యాలను పరికిస్తూ ఏవన్నా మార్పులుంటాయేమోననే గుండెబెదురు తగ్గించుకుని తిన్నగా స్టేషన్ వద్దకి చేరాను. స్టేషన్ కిలోపలా, బయటా, అంతా కల్లోలమయం. వచ్చేవాళ్ళూ, పోయేవాళ్ళూ, వాళ్ళకి వాళ్ళకుటుంబాలకి వీడ్కోలివ్వడానికి వచ్చిన స్నేహితులూ, వయసులో వున్న అందగత్తెల్ని చూస్తూ తృప్తిపడుతూ, అందుకోసమే ప్రతిరోజూ అక్కడికొచ్చే సిల్కు సూట్లూ, ఓ...రకరకాలజనం...మధ్య మధ్య రైల్వే పోలీసుల అదలింపులూ, బిచ్చగాళ్ళ లాలింపులూ, ఇవన్నీ దగ్గరే వున్న కిళ్లీదుకాణం ముందు నిలబడి చూట్టం నాకలవాటు. ఈ జనం అంతా ఏం పనులమీద ఇలా ఎప్పుడూ ప్రయాణం చేస్తూంటారో తెలీదు. ప్రయాణం నిజంగా ఎంత ఆనందకరమైందో ఊహించుకుంటుంటే నాలో ఏదో ఉత్సాహం వ్యాపించి పోతూంది. చిన్నప్పుడు నేను ప్రయాణంచేస్తూంటే కలిగిన అనుభవాలు ఒక్కొక్కటే వరగగా జ్ఞప్తికొస్తాయి. జరిగిన ప్రతి అనుభవం జీవితసువర్ణానికి గీటురాయి లాంటిది. కాని ఎప్పుడు మళ్ళీ ప్రయాణం చేయాలనుకున్నా నాకు అవకాశం లభించలేదు... "అజంటా, ఎల్లోరా"లు చూటానికి మళ్ళీ ఒకసారి వెడదామని ఆమధ్య మిత్రుడు "రాయ్" అన్నాడే గాని మళ్ళీ ఆమాట ఇప్పటికీ ఎత్తలేదు. సరే అవకాశం దొరికితేమాత్రం ఇష్టంవచ్చినంత దూరం, శరీరానికీ, మనస్సుకీ, అలసట జనించి ఆయువు క్షీణించి పోతూన్నాసరే ప్రయాణం చేయాల్సిందే...నిజంగా ఇప్పటి సైంటిస్టులు చంద్రలోకానికి మార్గాన్ని కనిపెడుతున్నారని వినగానే అక్కడికూడా వెళ్ళిచూస్తే బావుంటుందేమోననే దురాశ నాలో ప్రబలుతోంది. కాని లాభంలేదు. గుమస్తాగాడు చంద్రలోక ప్రయాణం పరకూ కాదు, ఆఫీస్ నుంచి ఇంటికి పోవడానికి జట్కాబండికూడా మొగం వాస్తాడు.

ప్రతీరోజూ మనకు కనిపించి ప్రతిదాన్ని గురించీ మనకెన్నో అనుభవాలుంటాయి. ఇవన్నీ ఒకదానికొకటి సంబంధించి వుండకపోయినా ఆ అనుభవాలకి సంబంధించిన పదార్థంగానీ వ్యక్తులుగానీ జ్ఞప్తికొస్తే వాటి కథలుగూడా చప్పున మనస్సులో మెదులుతూంటాయి. రైలునుచూస్తే నాకు ప్రయాణాల కథలు, ఆ ఆనందమూ మనస్సులో మెదుల్తాయి.

ఆ కూరగాయలుకొనే శాస్త్రిగార్ని చూస్తే మా హిస్టరీమాస్టారు కిష్టయ్యగారు కనపడతారాయనలో. ఆ అందమైన పంతులమ్మని చూస్తే, ఎక్కడో మూడువందల మైళ్ళదూరాన, "ఖరగ్‌పూర్"లో వున్న మా చెల్లాయి సరస్వతి చప్పున జ్ఞాపకంవచ్చింది. అవే కళ్ళూ, అంతే ఒడ్డూ, అదే చురుకుదనంతో మెరిసే చిరునవ్వూ...ఇలా ఒక్కొక్కటీ భిన్నభిన్న రూపాల్లో గోచరిస్తాయి. జీవితమంతా అనుభవాల ట్రెజరీ. అందులో మంచీ చెడూ అనేది లేదు. అంతా అక్కరకు వచ్చే రొక్కమే...ఆఁ కాకుంటే ఇంకా యే మారుమూలనో, శిథిలమై చిరిగిపోయిన కరెన్సీ నోట్లలాంటి అనుభవాలుంటాయి. కాని, నెంబరు పోకుండా జోడిస్తే అవీ అక్కరకే వస్తాయి.

రైలు రావడం కొంచెం ఆలస్యం అయింది. ఈలోగా పోస్టాఫీసుకు వెళ్ళి వుత్తరాలు తెచ్చుకుందామనుకుని బయల్దేరాను. పోస్టాఫీసునుచూచినప్పుడల్లా నాకు, చిన్నప్పుడు మా వూళ్ళో జరిగే "అంకమ్మ జాతర" జ్ఞాపకంవస్తుంది. ఇంటికి వుత్తరాలు తెచ్చిచ్చే పోస్టు బంట్రోతులున్నప్పటికీ, అందాకా ఆత్రం ఆగక, ప్యూన్లని పంపించేవారూ, స్వయంగానేవచ్చి, వుత్తరాలకోసం పడిగాపులుపడే వాళ్ళూ అంతా ఒక జాతర. ఒకో నాకు వీళ్ళంతా వందల సంఖ్యలో కనిపిస్తారు. ఏం? ఇలా రాకుంటే ఏం ప్రమాదం? వుత్తరాలెటన్నా పారిపోతాయా? ఇంటికిరావూ? ఇలాంటి అభిప్రాయం వస్తే మరి, నేనిందుకిలా ప్రతిరోజూ పోస్టాఫీసుకు రావడం? అంతా నాలాంటి ప్రజలేనా? వీళ్ళకి ఉత్తరాలంటే అంత శ్రద్ధా అనిపిస్తుంది. కాని, జీవితంలో క్రమేపీ ప్రతివాడికీ

ఒక విడువరాని అలవాటుగా మారుతుందని తెలుస్తుంది.

నేను పోస్టాఫీసుకెళితే వుత్తరాలు ఒకోనాడు సార్టింగ్ కావుకూడాను. అటువంటప్పుడు, ఆ పనంతా పూర్తి అయిందాకా, ఓమూలన బయట వరాండాలో, టెలిగ్రాం ఆపరేటర్ కిటికీపక్కగా నిలబడతాను. అది నా హక్కుభుక్తమైన స్థానం. ఇంకెవడూ నిలబడడక్కడ. ఇలాగే ప్రతివాడికీ ఏదో ఒక స్థలం వున్నట్టు తోస్తుంది. లేకుంటే నా జాగాని ఒక్కడూ ఆక్రమించని కారణం?

ఆ కిటికీ పక్కన నిలబడి, టక్, టడక్, అనే ఆ ధ్వని వింటూన్నకొద్దీ నాలో ఎంతో ఆనందం పెల్లుబుకుతుంది. ఆ ధ్వనిలో నామనస్సుకి హాయిని చేకూర్చే మార్దవం కనిపిస్తుంది. అతిచిత్రంగానూ వుంటుంది. ప్రతిరోజూ, ఇలాంటి చిత్రమైన ఆ ధ్వని వింటూ, దాంతోనే కాలంగడిపే, ఆ ఆపరేటరన్నయ్య ఎంత అదృష్టవంతుడో ననేభావం వస్తుంది. ఈ ఫీలింగ్స్‌కి ఏమీ అర్థాలుండకపోవచ్చు. అర్థంకోసం గాదుగా. ఆ మండీ బాజార్లో ప్లీడరు గుమాస్తాకలీనినాడు ఎంత ఆరాటంగా వుంటుందో, ఈధ్వని విననినాడూ అంతే ఆరాటం నాకు. ఎందుకో?

ఇగంతా ఆలోచిస్తూ నేను మానవుడు ఈ "అలవాటు" అనే సూత్రంతో ఎంత గట్టిగా బంధింపబడతాడో, దాన్నించి విముక్తుడు కావడానికి ఎందుకు ప్రయత్నించడో అర్థంకాక, ఆశ్చర్యపడుతూన్నాను. ఈ అలవాట్లు అనేక రకాలుగా వుంటాయి. ప్రస్తుతం ఇప్పుడివి నాకు సంబంధించిన అలవాట్లు. ఇక మా మిత్రుడు ముకుందంగాడుకూడా కొన్ని అలవాట్లకి బానిసే. వాడికెక్కడన్నా డబ్బు విరాళరూపంలోగానీ, ఇంకే రూపంలోగానీ వస్తుందని తెలిస్తే చాలు, అదెంత కొద్ది మొత్తమైనా బోలెడుఖర్చు భరించి వెడతాడు. ఉదాహరణకి వాడు నడిపే పత్రికకి బందరులో ఎవడైనా పైసా విరాళం ఇస్తాడని తెలిస్తే, పదిహేను రూపాయలు క్షౌరంచేసుకుని, స్వయంగావెళ్ళి ఆ పైసా కాస్తా తెచ్చుకుంటాడు. "ఏమిట్రా ఇందులో నీకు లాభం?" అని ప్రశ్నిస్తే "అరే! విరాళం విరాళమే: ఖర్చు మనది. దేని పద్దు దానిదే. ఆ ఇచ్చే విరాళాన్ని గౌరవంగా అందుకోవడం మన లక్షణం" అంటాడు. కాని నేను నమ్మను. అలా వెళ్లడంలో ఆ ప్రయాణంలో వాడికేదో ఒకరకమైన ఆనందంవుండి తీరుతుంది. లేకుంటే ఎందుకుపోతాడు తనష్టాన్ని భరిస్తూకూడా. ఒకపత్రికా సంపాదకుడిస్థాయిలో, అలా వెళ్ళడం వాడి జీవితానికి ఆనందప్రదమైన అలవాటు తప్ప అట్టే విశేషం లేదేమో ననిపిస్తుంది. మా మిత్రుల అలవాట్లను గురించి చెప్పుకోవాలంటే ఒకోటి చిత్రంగా వుంటాయి. వాటినుంచి వాళ్ళకి ఫలితంలేదు కూడాను. అయినా వదలరు.

మా కవిమిత్రుడు ఆనందానికో పిచ్చిఆప్యాయతవుంది. ఎక్కడ ఎలాంటిసభ జరుగుతున్నా వూళ్ళో ఆఖరుకి అమ్మాయిలకి సంబంధించిన హైస్కూళ్ళ వార్షికోత్సవాలు జరిగినా సరే, పిలవకపోయినా తప్పని సరిగా హాజరై, అవకాశాన్ని కల్పించుకుని పద్యాలుపాడి మరీ వస్తాడు. వాడి కదోవిధమైన తృప్తి. పోనీ వాడేమన్నా పేరుకోసం తంటాలు పడుతూన్నాడా అంటే పాపం అదీలేదు. ఊళ్ళో ఏ మారుమూలన దేనికి సంబంధించిందైనా కానీండి, ఆఖరికి సంతాపసభైనా అది వాడి పద్యాల్లేకుండా జరగదు. అవతల మీటింగు జరుగుతూంటే, ఆఫీసులో వాడి కాళ్ళు భూమ్మీద ఆనవు. తెంచుకుని బయటపడాల్సిందే.

మా చిన్నచెల్లాయి "జయలక్ష్మి" నన్నప్పుడప్పుడడుగుతూంది నవ్వుకుంటూ "అన్నయ్యా! ఆనందం ఎందుకు, అట్లా కనబడ్డ చీపురుకట్టమీదకూడా పద్యాలు రాసి భట్రాజులా చదువుతాడూ" అని... నాక్కోపంవస్తుంది. ఈ అలవాట్లూ అనుభవాలనిగురించీ దానికి ఎంత బోధిస్తే ఏం అర్థం అవుతుంది. "నీవు పుస్తకంలో ప్రతి అక్షరం ఎందుకు చదువుతావు?" అంటాను. "రోజూ బడి కెందుకెళతావ్?" అంటాను. "నేర్చుకోడానికి" అంటుంది.

"ఐతే వాడుకూడా జీవితంలో ఏదో నేర్చుకోవడానికే అలా రాస్తాడు" అంటూన్నేను. చెల్లాయ్ ఇక మాట్లాడదు.

నేను ఇచ్చిన సంజాయిషీకీ, ఆనందం చదవడానికీ ఎక్కడా పోలికేలేదు. కాని మా జయలక్ష్మిని ఊరుకోబెట్టాలంటే అంతే అనాలి.

పిచ్చిపిల్ల...దానికేం తెలుసు. ఒకో మనిషికి ఒకో అలవాటుంటుందని?

లోకంలో ఇలాంటివాళ్ళు అలవాట్లని దూరం చేసుకుని బతకలేనివాళ్లు లక్షలనుంది. వీళ్ళనిగురించి మనం అర్థాలు కల్పించలేం. అనుకుంటూ ఏదో ఆలోచిస్తున్నా నేను.

ఇంతలో ఓ విద్యార్థి మిత్రుడు ఆఫీస్ ఆవరణలో ప్రవేశిస్తూ, అంత దూరాన్నుండే "నమస్కారమండీ!" అన్నాడు, అతనికి మళ్ళీ ప్రతి నమస్కారం చేసిం తరువాత. "కంటికి కాస్త నజరుగా కనిపించిన ప్రతివాడికీ ఓ నమస్కారం పారేశామంటే. వాడు ఏ సమయంలోనైనా మనకి అక్కరకు రావచ్చు." అనేవాడు మా తాతగారు... ఈ నమస్కారాలు చేసే వీళ్ళందరూ ఆ సూత్రాన్ని దృష్టిలో ఉంచుకునే చేస్తున్నారా అనిపిస్తూంది. లేకుంటే ఏమిటీ అర్థంలేని నమస్కారాలు. కనపడ్డవాడికల్లా నమస్కారం చేయడం, చేయించుకోవడం...ఇదేనా పని? ఇంకా ఈ అలవాట్లో చాలా బాధలు ఉన్నాయి.

మనకు నమస్కారం పెట్టేవాళ్ళలో మనకి తెలీనివాళ్ళూ, ఎక్కడో పరిచయమైన వాళ్ళూ, కొంచెం లీలగా గుర్తున్నవాళ్ళూ బోలెడుమందుంటారు. ఇది ప్రతి అనుభవస్తుడికీ తెలుసును కుంటాను. పోతే మనకు నమస్కారం పెట్టిన ప్రతి మనిషికీ, చచ్చినట్టుమనం మళ్ళీ ప్రతి నమస్కారం చేయాల్సిందే. అలా చేయకపోతే, మనం సమాజంలో గర్విష్టులకింద చలామణీ అవుతాం.

ఇంకో సంగతి. "నమస్కారం" అన్నప్పుడల్లా నాకు మా "సుందరమూర్తి" గుర్తుకు వస్తాడు. నేను కనబడ్డచోటనల్లా వాడు "నమస్కారం సార్!" అని రైఫిల్‌తో ఫైర్ చేసినంత భయంకరంగా అరచి నా ఏకాగ్రతని బద్దలు కొడతాడు. నేను కనీసం బడి పంతుల్ని కూడా కాదు. ముఖ్యంగా ఈ జెడదలు ఎక్కువగా వాళ్ళకే వుంటాయి. అయినా ఏదో వాడి దృష్టిలో నేనొక పెద్దమనిషినే నేమో అలా ఒక్కసారి నమస్కరించి వెడతాడు. పోనీ నాతో వాడికేదన్నా పనివుండి, అంతగా కావాలంటే, ఆపి, తనసంగతి చెబుతాడా అంటే అదీలేదు. ఊరికే అదో అలవాటు వాడికి. వాడు నమస్కరించినప్పుడల్లా నాగుండె పేలిపోయేంత అదురుతుంది. ఏంచేయాలి? పనివున్నా, లేకపోయినా మన ఫీలింగ్స్‌ని దూరానికినెట్టి చచ్చినట్టు మళ్ళీ ప్రతినమస్కారంచేసి ఈ న్యూసెన్సంతా భరించాల్సిందే. తప్పదు. నిజంగా నాకే ఏదన్నా ఓ చిన్న అధికారపదవి వుంటే ఈ నమస్కారాలు పెట్టుకోడాన్ని "ప్రొహిబిట్" చేసిపారేసి ఈ అలవాటున్న వాళ్ళందర్నీ "పబ్లిక్ న్యూసెన్స్" నేరంకిందకిలాగి కోర్టుల్లో నిలబెట్టే వాణ్ణే... అదిప్పట్లో నాకు కనుచూపు దూరంలోనే కాదు, జీవితంలోనే ఆ యోగం లేనట్టు కనపడుతుంది. మరేం చేయాలి...?

అందరికీ కొన్నికొన్ని అలవాట్లుంటాయనుకోండి! ఒకళ్ళకి బాధాకరంకానివే అన్నీను. కాని, ఈ "నమస్కారాల జాడ్యం" పాకిపోయి, మనిషికి శాంతిలేకుండా చేస్తుంది. దీన్ని పూర్తిగా ఆపివేయడానికి ప్రతివాడితో పంచాయతీ పెట్టుకోవడం కాదు మన పని, సాధ్యమైనంతవరకు మనమే జాగ్రత్తపడి ఒక చిన్నలిస్టు తయారు చేసుకోవాలి.

"మనం తప్పని సరిగా నమస్కరించాల్సి తెవరెవరికి? రోజూ మనం చూసేవాళ్ళల్లోంచి, ఇప్పుడు నమస్కరిస్తున్న వాళ్ళల్లోంచి ఎందర్ని ఈ పట్టికలో ఉదహరించాలి?

ఇక రెండోది మనం మళ్ళీ ప్రతినమస్కారం చేయాల్సిన వాళ్ళెంతమంది? నిర్మొగమాటంగా వాళ్ళ నమస్కారాలని రిసీవ్ చేసుకోకుండా దాటిపోవలసిన వాళ్లెందరు? ఇలా ఒక జాబితా తయారు చేసుకోందే, ఇటువంటి జాగాల్లో బతకడంకష్టం అనిపిస్తుంది. మన పట్టికలో లేనివాడికి చచ్చినా నమస్కరించ కూడదు. ప్రతివాడినీ బాధించే ఈఅలవాటునుంచి తప్పుకోవడం చాలా ఆరోగ్యకర విషయం."

నా ఆలోచనకి అంతరాయం కలిగింది. పోస్టు జవాను నాచేతికూడా ఒక చిన్న ఉత్తరం ముక్క అందించాడు. ఆత్రంగా కవరు విప్పి చూస్తే అది వెంకటేశ్వర్లు హైదరాబాద్‌నుంచి రాసిన వుత్తరం. నాకు బలే అసహ్యంవేసింది. ఉత్తరాన్ని అక్కడే ముక్కలు ముక్కలుగా చింపి, గాలికి వెదజల్లాను.

"డబ్బు చేతిలోలేక పత్రిక ఆగిపోయేదశలో వుందనీ, మళ్ళీ మిత్రుల దర్శనానికి రాదల్చుకొన్నాననీ, అభిప్రాయం తెలియచేయమనీ" రాశాడు.

ఇలా నే, ఇదివరకు వీడిపత్రికకి నేనుతంటాలు పడి, పల్లెల్లో మిత్రుల దగ్గర బిచ్చమెత్తి ఐదు వందల రూపాయలు సహాయంచేస్తే, ఆ డబ్బును తనదగ్గరున్న కొద్దిపాటి మొత్తంతోకలిపి, చెల్లెలి పెళ్ళికి ఖర్చుపెట్టి, ఆర్నెల్లు పత్రికని అచ్చు వెయ్యలేదు. వాడు చెల్లెలి పెళ్ళికి నాకుపంపిన శుభలేఖ మీది పోస్టింగ్ డేట్ చూస్తే పెళ్ళయిన మూడోనాడు పోస్టు చేసినట్టు ఋజువయింది. ఇంతకంటే మోసం ఇంకేం కావాలి? ఈమధ్య మళ్ళీ పత్రిక నడుస్తున్నదనీ, క్షమించమనీ రాస్తే నేను జవాబీయలేదు. మళ్ళీ ఇవాళ ఈ ఉత్తరం. ఇదివరకు చేసిన పనికి కనీసం వాడు సిగ్గు పడుతూన్నట్టుకూడా కనపడదు. ఇక నేనేమనుకోను?

నాకూ, ఇంకా వందలాది ప్రజలకీ ఇలా రైలు దగ్గరకీ, పోస్టాఫీసుకూ, పార్కుకూ రావడం ఎలాంటి నిత్యకృత్యాలో, మా వెంకటేశ్వర్లుకి కూడా ఎవణ్నో ఒకణ్ణి ఇలాంటివాణ్ణి పట్టుకొని డబ్బుచేసుకోవటం నిత్యకృత్యమేనేమో ననుకుంటాను.

చాలా టైమైంది. ఆఫీస్‌కు ఆలస్యం అవుతోందనే తొందరతో. అలవాటు ప్రకారం కాళ్ళు చురుకుగు తెచ్చుకుంటూన్నయ్.

కథానిక

# ఎండమావులు

## ఆర్. యం. చిదంబరం

మునిసిపల్ సైరన్ పన్నెండు గంటల కేక కూసింది. కెవ్వున కేకతో భూమిమీద పడిందొకజీవి. బయట "ఏమౌతుందో-ఇంకేమౌతుందో"అని ఆరాట పడుతూ పచారుచేస్తున్న తండ్రికి "మగపిల్లాడు" అని నర్సు అనేసరికి ఎక్కడలేని సంతోషం పుట్టుకొచ్చింది. అనంత కాలంలో లభించే "ఆనంద"మనే దాన్ని అతను అనతికాలంలో అనుభవించాడు. ఇక పసిడిపలుకుల మిసిమితనాన్ని విని జగాన్నే మరవాలనుకున్నాడు.

అంతా సక్రమంగా జరిగింది. దినాలు చకచకా దొర్లిపోయాయి. కాని పిల్లాడికి పేరుపెట్టడంః దగ్గర తలిదండ్రులకు పేచీ వచ్చింది. తన తండ్రిపేరు పెట్టుకుంటాననంటుంది తల్లి. "మా నాన్న పేరు పెడతా"నంటాడు తండ్రి. సంప్రదాయాన్ని త్రోసిరాజంటూ వాదించుకున్నారు.

ముసలమ్మ వచ్చి ఇద్దరికీ రాజీ కుదిర్చింది! "ఆయనపేరే పెట్టనీవే కోడలా! నువ్వు ముద్దుగా మీ నాన్న పేరుతో పిలుచుకో. బాగుంటుంది" అనుభవశాలి ఆలోచనకు ఇద్దరూఅంగీకార సూచకంగా తలలూచారు "రమణ" అన్న పేరు కుర్రాడికి యింట్లో సార్థకమయింది.

రమణ జీవితం చకచకా దొర్లుకొంది. పసిపాపల వింత ఆటలతో, తెలిమల్లెపూల చిరునవ్వుతో. కేరింతలతో నాలుగేళ్లు గిర్రునతిరిగాయి. వాళ్ళనాన్న రమణకు సిల్కుచొక్కాలు కట్టించాడు. గ్లాస్కోజు బిస్కత్తులు కొనితెచ్చాడు. అత్యాదరంతో ప్రేమించాడు. కంటికి రెప్పలా కావలికాచాడు. తలిదండ్రులిద్దరూ బిడ్డను సమానాదరంతో ప్రేమిస్తున్నారు కనుక అతని విషయమై వారిద్దరి మధ్య పోట్లాటలేదు.

రమణ ఓనాడు ద్రాక్షపళ్లు తిన్నాడు. అది దేవామృతంలా కనిపించింది. జీవితాంతం వరకు అదొక యిష్టవస్తువుగా ఉండిపోయింది. ఒకనాడు బొమ్మల కొలువుకని వాళ్ళనాన్న బజారునుండి కొన్ని లక్కసామాన్లు తెచ్చాడు. వాటిలో ఓ ద్రాక్షపళ్ళగుత్తి ఉంది. రమణ వాటిని నిజంపళ్ళనుకుని తినబోయడు. శిల్పి చాతుర్యమతన్ని మోసగించింది.

కోపంతో అమ్మమ్మదగ్గరకు కథలకోసం చేరాడు. ముసలమ్మ కాళ్లుచాపుకుని ఆవలించింది.

"అమమ్మా! ఒకథచెప్పవూ" అనడిగాడు.

"ఊఁ ..పోయిపడుకోరా - అస్తమానూ కథ